

# నవ్వీన చోటే గెలుపు పంట

**గతంతో** పోలిస్తే, కుటుంబ వ్యాపారాల్లోకి మహిళలు ఎక్కువగానే వస్తున్నారు. కానీ దేవిత షరాఫ్ మాత్రం మరో అడుగు ముందుకేశారు. ఇరవై ఒక్క ఏండ్లు నిండగానే తండ్రి స్థాపించిన జెనిత్ కంప్యూటర్స్‌లో మార్కెటింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. అంతకుమించి, ఏదైనా వినూత్నంగా చేయాలనుకున్నారు. ఇంటెల్, ఎమ్ఐటీ లాంటి దిగ్గజ సంస్థల పెద్దలతో సంభాషించిన తర్వాత... ఆ లక్ష్యం మరింత బలపడింది. Vu అనే టెక్నాలజీ కంపెనీని స్థాపించారు. నాణ్యమైన టీవీలను అందుబాటు ధరలో అందించడం ఈ సంస్థ ఉద్దేశం. ఈ మాట చెప్పగానే అందరూ పకాపకా నవ్వారు. కారణం, అప్పటికే చైనా నుంచి సవాలక్ష బ్రాండ్స్ మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. ఇక కొరియన్, జపనీస్ కంపెనీలైతే బాసింపట్టు వేసుకుని మరీ స్థిరపడిపోయాయి. ఈ నేపథ్యంలో ఓ భారతీయ బ్రాండ్ నిలదొక్కుకోవడం అసాధ్యమన్నారు. దేవిత మాత్రం తన దూకుడుతోనే జవాబు చెప్పారు. ఈ రోజు ఆ సంస్థ 400 కోట్ల రూపాయల టర్నోవర్‌కు చేరుకుంది. అన్ని విభాగాల్లో ఉనికిని చాటుకుంటున్నది. అరబ్ దేశాలకు సైతం టీవీలు ఎగుమతి అవుతున్నాయి. 'పరిమితులను ప్రశ్నించడమే నా విజయ రహస్యం' అని చెబుతారు దేవిత. కాదనగలమా!


నమస్తే తెలంగాణ

# జిందగీ

11

హైదరాబాద్ | శనివారం 16 డిసెంబర్ 2023 www.ntnews.com


Fashion



● సమత చౌదరి, డిజైనర్ wowbySamathachowdari

## వయొలెట్.. వావ్ వావ్!

సో బ్యూటిఫుల్... సో ఎలిగెంట్... యు ఆర్ జస్ట్ లుకింగ్ లైక్ ఎ వావ్!!... అనిపించుకోవా లంటే, ముందు వావ్ వావ్ వయొలెట్ వన్నె ఉండాల్సిందే. అందులోనూ ఆడవాళ్లు అమితంగా ఇష్టపడే బెనారస్ పట్టు అయితే కట్టిపడేస్తుందంతే. సిల్వర్ జరీ, పింక్ పైపింగ్‌తో వచ్చిన ఈ చీరకు అదే లేత గులాబీ రంగు రవిక ముచ్చటైన జోడీ అయ్యింది. జాకెట్ మీద మ్యాచింగ్ ఎంబ్రాయిడరీ, హై నెక్ స్టిచింగ్ ఫ్యాషన్ లుక్‌ను తీసుకొచ్చాయి.

'నానమ్మ పప్పు కూర వండితే ఎంత కమ్మగా ఉండేదో', 'మా అమ్మ చేతి వంట తినాలంటే పెట్టి పుట్టాలి'.. ఇలాంటి మాటలు ప్రతి ఇంట్లో వింటూనే ఉంటాం. ఆ వంటలకు అంత రుచి ఎలా వచ్చిందని అడిగితే మాత్రం సమాధానాలు వేరువేరుగా ఉంటాయి. అవును, హస్తవాసే రుచికి ప్రధాన కారణం. వండిన పాత్రకు కూడా ఆ ఘనతలో వాటా ఇవ్వాల్సిందే. కాబట్టే, ఆరోగ్యాన్ని ప్రసాదించే సంప్రదాయ వంటపాత్రల వ్యాపారంలోకి వచ్చారు కాయల్ విజీ.



స్టార్టప్ స్టోరీస్





# ఆరోగ్యానికి పెద్ద పాత్ర



**కార్పొరేట్** జీవితానికి అలవాటుపడ్డాక.. ఏదిపడితే అది తినడం అలవాటైపోయింది. ఫలితంగా ఆరోగ్యం నాశనమై పోతున్నది. శరీరం రిపేరుకు వస్తున్నది. దీంతో ఆ జీవ యంత్రాన్ని బాగుచేసుకునేందుకే పాత పద్ధతులవైపు పరుగులు తీస్తున్నారు జనం. సరే, ఆహార పదార్థాలను సేంద్రియ పద్ధతిలో పండిస్తాం. వాటిని వండే విధానంలో మార్పు లేకపోతే ఏం లాభం? ఈ ప్రశ్నలోంచి పుట్టిందే 'ఎసెన్షియల్ ట్రెడిషన్స్'. 'సంప్రదాయ వంటపాత్రల్లోనే వండుకు తిందాం' అనే నినాదంతో 2016లో చెన్నైలో ఈ దుకాణాన్ని ప్రారంభించారు కాయల్ విజీ. అంతకు ముందు.. కాయల్ సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలు, పండ్లు, ఆకు కూరలు, బియ్యం, తృణధాన్యాలు విక్రయించే ఆర్గానిక్ స్టోర్ నడిపేవారు. చెన్నైలో కాయల్ ఆర్గానిక్ స్టోర్‌కు ఇప్పటికీ మంచి పేరుంది. అయితే.. 'అందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో సేంద్రియ పద్ధతిలో పండించి మరీ అమ్ముతున్నాం. అంతవరకు బాగానే ఉంది. కానీ, వారు వండుకుతినే పద్ధతి మాటేమిటి?' అనే కోణంలో ఆలోచించారు. 'ఆర్గానిక్ విధానంలో పండించిన పదార్థాలను అదే పద్ధతిలో వండే మార్గమేదైనా ఉందా' అని అన్వేషించారు. కాయల్‌కు అద్భుతమైన సమాధానం దొరికింది. మన పూర్వికులు వాడుకున్న పాత్రల్లో వంట చేసుకుంటే కనుక, అనేక లాభాలు చేకూరుతాయని తెలుసుకున్నారు. ఇందుకు తానేం చేయగలననే అంతర్మథనం మొదలైంది. లోతైన అధ్యయనం తర్వాత.. కొన్ని రకాల లోహాలు, మట్టితో చేసిన వంటపాత్రలు ఆరోగ్యాన్ని కాపాడటంతోపాటు సహజంగా కొన్ని మినరల్స్‌ను అందిస్తాయని అర్థమైపోయింది. వెంటనే.. తన ఆర్గానిక్ స్టోర్‌లో సంప్రదాయ వంట పాత్రలు అమ్మకానికి పెట్టారు విజీ. ఆ వ్యాపారాన్ని విస్తరిస్తూ 'ఎసెన్షియల్ ట్రెడిషన్స్' పేరుతో ప్రత్యేక దుకాణం తెరిచారు. ఉక్కు, ఇనుము, రాగి, కంచు, ఇత్తడి, తగరం, చెక్క, మట్టి పాత్రలను జనానికి పరిచయం చేశారు. ఆయా పాత్రల్లో వండుకుని తింటే ఎలాంటి లాభాలు ఉంటాయో కస్టమర్లకు వివరించారు. దీంతో వ్యాపారం పెరిగింది. చెన్నైలోనే మరో రెండు స్టోర్లను ప్రారంభించారు కాయల్. ఆ తర్వాత బెంగళూరు, హైదరాబాద్‌లలో అడుగుపెట్టారు. స్టోర్ల సంఖ్య పెంచుతున్నప్పుడు 'ఇంకోసారి ఆలోచించు. ఆర్గానిక్ పద్ధతులను అనుసరించే వారు, సంప్రదాయ పాత్రలు వాడేవారు తక్కువగా ఉంటారు. వ్యాపారంలో నష్టం వస్తుందేమో' అని హెచ్చరించిన వారూ ఉన్నారు. కానీ.. తన మీద తనకున్న నమ్మకంతో కాయల్ ధైర్యంగా అడుగు ముందుకు వేశారు.

> **మన** పూర్వికులకు కృత్రిమత్వం అంటే ఏమిటో తెలియదు. ఆ స్ఫూర్తితోనే ఎసెన్షియల్ ట్రెడిషన్స్ పేరుతో వంటపాత్రలు అందిస్తున్నా. స్పందన బాగుంది. భవిష్యత్తులో హైదరాబాద్‌లో మరిన్ని స్టోర్స్ తెరవాలనుకుంటున్నా. ఆ తర్వాత ఉత్తరాది గురించి ఆలోచిస్తా.
>
> ● **కాయల్ విజీ**, ఎసెన్షియల్ ట్రెడిషన్స్

### పోషకాలు పోకుండా

నిత్యం వాడే అల్యూమినియం, స్టీలు పాత్రలకు బదులు.. మన తాతలు, తండ్రుల కాలంలో వాడిన ఐరన్, కాస్ట్ ఐరన్ పాత్రలు వంటకు చాలా మంచివని సూచిస్తారు కాయల్ విజీ. ఈ పాత్రల్లో వండితే.. అందులోని ఐరన్ ఆహార పదార్థాల్లోకి విడుదలై ఒంటికి ఐరన్ అందుతుంది. కాకపోతే.. ఈ లోహపు పాత్రలు మెల్లగా వేడెక్కి, మెల్లగానే చల్లబడుతాయి. అంతేకాదు.. వీటిని మారుతున్న వాతావరణానికి అనుగుణంగా సీజనింగ్ చేయాలి. అంటే.. తుప్పు పట్టకుండా ఆముదం, నూనె వంటివి రుద్ది పక్కన పెట్టాలి. ఇక మట్టిపాత్రల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇందులో వండితే కనుక, ఆహారంలో పోషక విలువలు నశించకుండా ఉంటాయి. రకరకాల మృత్తికలతో చేసి, నిప్పుల్లో కాల్చడం వల్ల మట్టిలోని మినరల్స్ ఆహార పదార్థాల ద్వారా శరీరానికి అందుతాయి. అయితే.. మట్టిపాత్రలు ఎంచుకునేటప్పుడు మెరుస్తున్నవి, నున్నగా ఉన్నవి కాకుండా, గరుకుగా ఉన్నవే ఎంచుకోవాలని సూచిస్తారు కాయల్. ఆమె రాతి పాత్రలనూ విక్రయిస్తారు. ఈ పాత్రల్లో వంట చేయలేం. కానీ నిల్వ ఉంచుకోవచ్చు.

.. సుంకరి ప్రవీణ్‌కుమార్

చిన్న యాదగిరిగౌడ్

# ఆ ప్రపోజల్ మంచిదేనా?

నా వయసు నలభై నాలుగు. ఈ మధ్యే విడాకులు తీసుకున్నాను. ఓ పెద్ద కార్పొరేట్ కంపెనీలో పని చేస్తున్నా. ప్రయాణాలంటే ఇష్టం. ఏదో సెమినార్‌లో ఓ యువకుడు పరిచయం అయ్యాడు. వయసు ఇరవై తొమ్మిది. అందంగా ఉంటాడు. ఆకట్టుకునేట్లు మాట్లాడతాడు. ఫోన్ నంబర్లు ఇచ్చిపుచ్చుకున్నాం. తరచూ కలుసుకుంటాం. దూర ప్రాంతాలకు వెళ్తుంటాం. హఠాత్తుగా ఓ రోజు వచ్చి పెళ్లి చేసుకుందామని ప్రతిపాదించాడు. ఇప్పటికిప్పుడే ఆ నిర్ణయం వద్దు. రెండేళ్ల తర్వాత ఆలోచిద్దాం అని చెప్పాను. అయినా వినడం లేదు. అతనితో కలిసి బతకడానికి నాకు సమస్య లేదు. భవిష్యత్తులో అతను ఇబ్బంది పడతాడని నా భయం. మీ సలహా ఏమిటి?

**అతను** పసివాడేం కాదు. చదువుకున్నాడు. ఉద్యోగం చేస్తున్నాడు. సమాజంలో గౌరవనీయమైన స్థానంలో ఉన్నాడు. అతని ప్రతిపాదనలో నిజాయతీ ఉంటే.. తప్పక అంగీకరించండి. ఇక భవిష్యత్తు అంటారా? మీ వయసుకు తగినవాడిని చేసుకున్నా కూడా.. రెండేళ్ల తర్వాత ఆ వ్యక్తి మనసు మారే అవకాశం లేదని చెప్పగలరా? కాబట్టి, మీ ఆలోచనల్ని పక్కన పెట్టి.. మీ అభిప్రాయాలకు విలువ ఇస్తాడా? మీ కెరీర్‌ను ప్రోత్సహిస్తాడా? మీకు అండగా ఉంటాడా? అనేది ఆలోచించండి. అన్ని విధాలా తగినవాడు అనిపిస్తే ఆమోదం తెలపండి.

డియర్ జిందగీ



ఎవరైనా కథానాయిక పాత్రలు కలగంటారు. హీరోయిన్ క్యారెక్టర్‌లో హీరోతో ప్రేమాయణం నడపాలని, కోడలుపిల్లగా అత్త పాత్ర అభిమానం సంపాదించాలని కోరుకుంటారు. జీ తెలుగు 'నిండు నూరేళ్ల సావాసం'లో కీలక పాత్ర పోషిస్తున్న లావణ్య రావ్ మాత్రం ప్రతినాయికగానే పేరు తెచ్చుకోవాలని ఆశిస్తున్నారు. ఆ కన్నడ కాంత చిన్నతెర ప్రయాణం ఆమె మాటల్లోనే..



# నిండు నూరేళ్ల అదృష్టం!

చిన్నతెర

**మాది** బెంగళూరు. అమ్మ కన్నడ వనిత. నాన్న మహారాష్ట్ర వ్యక్తి. అలా, కన్నడ–మరాఠీ భాషల మీద పట్టు వచ్చేసింది. తెలుగు నేర్చుకోడానికి మాత్రం కొంత సమయం పట్టింది. ఓ కన్నడ సినిమాలో హీరోయిన్‌గా చేశాను. తెలుగులో 'ముత్యాల ముగ్గు' సీరియల్‌తో నా చిన్నతెర కెరీర్ ప్రారంభమైంది. అందులో నాది నెగెటివ్ రోల్. మధ్యలో 'రామసక్కని సీత' చేశాను. 'ముక్కుపుడక' చేస్తున్నాను. నెగెటివ్ రోల్ ఇచ్చే కిక్కే వేరు. నిజానికి మనోహరి పాత్రను మహేశ్వరి అనే నటి చేశారు. వ్యక్తిగత కారణాల వల్ల ప్రాజెక్ట్ నుంచి తప్పుకొన్నారామె. ముందు నుంచీ నేను 'నిండు నూరేళ్ల సావాసం' సీరియల్ ఫాలో అవుతున్నాను. ఆ పాత్ర నేను చేస్తే ఎలా ఉంటుంది? అనుకునే దాన్ని. అంతలోనే అవకాశం వెతుక్కుంటూ వచ్చింది. మేకప్ వేసుకుంటున్నప్పుడు ఎంత ఆనందంగా అనిపించిందో!

### నాన్న.. రావణుడు

నాన్న మంచి నటుడు. నాటకాల్లో ఆయన రావణాసురుడి పాత్ర ధరిస్తే.. దశకంఠుడే స్టేజీ మీదికి వచ్చిన భావన కలిగేది. నాన్న వికటాట్టహాసం చేస్తుంటే.. నేను, చెల్లి భయపడి ఏడ్చేవాళ్లం. అంత గాంభీర్యం, అంత సహజత్వం. అమ్మ స్టాఫ్‌నర్స్. నాకో చెల్లి ఉంది. నాన్న మరణం తర్వాత అమ్మే మా సర్వస్వం. చిన్నతెర వైపుగా నా ప్రయాణం మాత్రం యాదృచ్ఛికంగానే మొదలైంది. అప్పట్లో ఓ రియాలిటీ షో చేశాను. అది చూసి నిర్మాతలు ముందు కొచ్చారు. అప్పటికే నేను ఎంకామ్ చదివాను. టీచింగ్‌లో స్థిరపడాలని కోరిక. కానీ చిన్నతెర తలుపు తట్టడంతో ఇటువైపు వచ్చాను. కన్నడలో మూడు ప్రాజెక్ట్‌లు చేశాను. ఆ పరిశ్రమ నాకు నటన నేర్పింది. డైలాగులు చెప్పడం బోధించింది. మా ఆయన ప్రోత్సాహమూ మరువలేనిది. మాది ప్రేమ వివాహం.

### తెలుగువారికి థ్యాంక్స్..

తెలుగు పరిశ్రమకు వచ్చాక.. నా నటనలో పరిపక్వత వచ్చింది. తోటి నటులు, సాంకేతిక సిబ్బంది.. ప్రతి ఒక్కరూ ఎంతో ప్రోత్సహిస్తారు. ప్రతినాయిక పాత్ర పోషించడంలో సమస్యలూ ఉంటాయి. ఓ సారి జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడికి వెళ్లినప్పుడు ఓ పెద్దావిడ నానా తిట్లూ తిట్టింది. 'నువ్వూ మనిషివేనా? ఎదుటి వాళ్లను బాధపెట్టి సంతోషిస్తావా?' అంటూ మీదిమీదికి వచ్చింది. సహనటులు అడ్డుకోవడంతో సరిపోయింది. లేకపోతే, ఏమైపోయేదాన్నో? ఓ వైజాగ్ కుర్రాడైతే చేతిమీద నా మొహాన్ని టాటూగా వేయించుకున్నాడు. ఇలాంటి అనుభవాలు అనేకం.

... హరిణి

# చలికి చిగురుటాకులా..

చలికాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అనేక జాగ్రత్తలు తీసుకుంటాం మనం. మరి మొక్కలు? చలి నుంచి తప్పించుకోలేక.. ఆరుబయట పొడిగాలులు, మంచును తట్టుకోలేక నిర్జీవంగా, నిస్తేజంగా మారిపోతాయి. శీతకాలపు గండాన్ని దాటలేకపోతాయి. చిన్నపాటి ఉపాయాలతో ఈ సమస్యను సులభంగా అధిగమించవచ్చు.

**మల్చింగ్:** చలిని తట్టుకునేందుకు, మోతాదుకు మించిన నీటి కారణంగా కుళ్లిపోకుండా ఉండేందుకు, పోషకాలు సమృద్ధిగా అందేందుకు.. మొక్క చుట్టూ ఉన్న ఉపరితలాన్ని కప్పి ఉంచాలి. ఈ ప్రక్రియనే 'మల్చింగ్' అంటారు. ఇందుకోసం ఎండుగడ్డి, కొబ్బరిపీచు, ఎండు ఆకులు ఉపయోగిస్తారు.



**నీరు:** ఒక్కో మొక్కకు ఒక్కోలా నీటి అవసరం ఉంటుంది. వాతావరణం చల్లగా ఉన్నా సరే.. పొడిగాలులు, తక్కువ తేమ కారణంగా ఎప్పటికప్పుడు నీరు అందిస్తూ ఉండాల్సిందే.

**సూర్యరశ్మి:** వరండాలోని మొక్కలను సూర్యరశ్మి తగిలే చోటుకు మార్చాలి. పెరట్లో మొక్కలు మరీ గుబురుగా పెరిగిపోయి వేర్లు కుళ్లిపోకుండా... దట్టంగా ఉన్న ఆకులను జాగ్రత్తగా తొలగించాలి.



**రాత్రివేళల్లో:** తెలంగాణలో చాలా చోట్ల చలికాలపు రాత్రులు గడ్డ కట్టించేస్తుంటాయి. పడిపోయిన ఉష్ణోగ్రతల నుంచి మొక్కల్ని కాపాడేందుకు రాత్రివేళ వాటి మీద గోనె సంచులు, ప్లాస్టిక్ కవర్స్, పాత దుప్పట్లు లాంటివి కప్పి ఉంచితే మంచిది.

**..చలికాలం** కొన్ని మొక్కలకు కష్టకాలమే కావచ్చు. అయినా, నిరాశ పడిపోకుండా వాటిని జాగ్రత్తగా సంరక్షించుకోవాలి. మరికొన్నేమో చలికాలంలోనే అందమైన పూలు ఇస్తాయి. క్యారెట్, క్యాలీఫ్లవర్, పాలకూర లాంటి కాయగూరలు చలికాలంలో మరింత రుచిగా ఉంటాయని చెబుతారు ఉద్యానవన నిపుణులు.